# శిబి

''**మా** అయ్య!'' అని బావురుమన్నాడు రాములు తాము గట్టుమీదకు లాక్కొచ్చిన శవం వంక చూస్తూ.

''సరే, గమ్మునుండు. ఆళ్ళు పసిగడ్తిరా, పెద్ద గోలవుద్ది'' అన్నాడు నర్సింహ.

ఇద్దరి ఒంటినుండి నీళ్ళు కారుతున్నాయి. దూరంగా బీడీలు తాగుతూ నుంచుని మాట్లాడుకుంటున్నారు వానుడ్రైవరు, కానిస్టేబులు. ఫోటోగ్రాఫరు లెన్సు సరిచూసుకుంటూ హుసేన్‌సాగర్ వంక చూస్తున్నాడు.

హుసేన్‌సాగర్ తీరంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పక్క దృశ్యం అది. హైదరాబాదు నగరంలో ఆత్మహత్యలకు అంత చక్కటి సదుపాయం కలిగించే తటాకం మరోటిలేదు. చెరువు చుట్టూ ఎత్తైన బారికేడ్లూ, ఇరవైనాలుగ్గంటల పహరా ఏర్పాటు చేయకుండా, ప్రజలు హాయిగా ఆత్మహత్య చేసుకునే అవకాశం కల్పించి ప్రభుత్వం శక్తిమేరకు తనవంతు బాధ్యత నిర్వహిస్తోంది. ప్రజాసేవ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంకదా!

కానీ వచ్చిన చిక్కల్లా జనం చెప్పి చావకపోవటం. ముందే సూచన ఇస్తే ప్రభుత్వం తన ఏర్పాట్లలో తానుండేదికదా! సాగర్‌లో తేలిన శవాలను వెలికితీయాల్సిన బాధ్యత పోలీసులది. ముప్పై నాలుగు లక్షల జనాభావున్న నగరంలో ఎక్కడ ఏ శవం తేలినా, దాన్ని తరలించేందుకు పోలీసు డిపార్ట్‌మెంటువారికి ఒకటే వాను వుంది. పోలీసు కంట్రోలు రూం దగ్గరుండే వానును ఎవరికి అవసరమైనప్పుడు వాళ్ళు ఫోనుచేసి పిలిపించుకుంటుంటారు. శవాల వెలికితీతకు కూలీలను నియమిస్తుంటారు పోలీసులు. ఆ పనిమీదే వచ్చారు రాములు, నర్సింహ.

నిజానికి శవం పొరపాటు లేదు ఇందులో. రెండు రోజుల క్రితమే నీళ్ళమీద తేలిందది. వాను అందుబాటులో లేకపోవటంవల్ల శవాన్ని వెలికితీసే పని జరగలేదు. ఆరోజూ, మరుసటి రోజూ డ్రైవరు శలవులో వున్నాడు. అంతా సజావుగా అయి శవం బయటకొచ్చేటప్పటికి మూడు రోజులయింది.

''ఇప్పుడాళ్లకు సచ్చినోడు మా అయ్య అని సెప్పేడవక. ఎందుకు సచ్చిండు, నువ్వేం జేసినవు. నీ పెండ్లామేం జేసింది అని సవాలచ్చ పెశ్నలేస్తరు. దవాకాన కాడనుంచి పీనిగెని మనకప్పజెప్తరు.

ఈన్ని బొందలవెట్టేదానికి ఎంత కర్సువుద్ది! నీ తాన పైసలేదున్నయి. నువ్వు నోరు మూతె ట్టుకుంటే మునిసిపాల్టీవోళ్ళే బొందలవెడ్తరు'' అన్నాడు నర్సింహ మిత్రుడికి సలహా ఇస్తూ.

రాములుకు తండ్రి శవాన్ని చూస్తుంటే దుఃఖం వట్టలేనట్టుంది. అయినా నర్సింహ మాటల్లోని సత్యాన్ని గ్రహించగలిగాడు రాములు. పోలీసులు కేసును నమోదు చేసుకున్న తరువాత మృతదేహాన్ని గురించిన అన్ని వివరాలను నగరంలోని అన్ని పోలీసుస్టేషన్లుకు, పత్రికలవారికీ తెలియపరుస్తారు. అంతకుముందే తమకు సంబంధించినవారు కన్పించటంలేదని స్థానిక పోలీసుస్టేషన్‌లలో ఫిర్యాదుచేసుకున్నవారికి సాగర్‌లో లభించిన మృతదేహాల వివరాలను తెలియజేస్తారు. బంధువులెవ్వరైనా వుండి ఆ మృతదేహాలను గుర్తుపడ్తే వాటిని వారికి పోస్ట్‌మార్టం తర్వాత అప్పగించటం జరుగుతుంది. మృతదేహాలకు సంబంధించినవారు ఎవరూ రానప్పుడు గుర్తింపుకోసం 5-7 రోజుల వరకు శవాన్ని మార్చురీలో వుంచుతారు పోలీసులు. ఆ తరువాత ఆ శవాన్ని అంత్యక్రియల కోసం మునిసిపాలిటీవారికి అప్పగించటం జరుగుతుంది. రాములుకిదంతా తెల్సు. సంవత్సరం నుండి సాగర్ నుండి శవాలను వెలికితీస్తూనే వున్నాడతను. 'ఔ, తన తాన పైసలేదు. నాయన పీనిగెని బొందల పెట్ట పైసలేదున్నాయి?' అని తమాయించుకున్నాడు రాములు. కానిస్టేబుల్ పసిగడ్తాడేమోనని కళ్ళు తుడుచుకున్నాడు. నిజానికి కళ్ళు తుడ్చుకోకపోయినా అతనినెవరూ గుర్తించలేరు. సాగర్ నీళ్ళలో తడిసి నీళ్ళోడుతున్నాడతను.

కూలివాళ్ళు శవాన్ని పైకి తీసుకరావటం చూసి డ్రైవరు, కానిస్టేబుల్, ఫోటోగ్రాఫరు తీరం దరికి వచ్చారు. ''ఫోటోలు తియ్యవయ్యా, ఎల్లిపోదాం'' అన్నాడు కానిస్టేబుల్ బీడీ పారేసి.

ఫోటోగ్రాఫర్ శవాన్ని రకరకాల కోణాలనుండి ఫోటోలు తీశాడు.

''ఇంక వాను లోపల పెట్టండ్రా శవాన్ని'' అని ఆదేశమిచ్చాడు కానిస్టేబుల్.

రాములు, నర్సింహ శవాన్నెత్తి వానులోపల పెట్టి, తామూ ఎక్కికూర్చున్నారు. శవాన్ని వెలికితీయటంతో, వానులో పెట్టటంతో వాళ్ళ పని అయిపోదు. ఆసుపత్రికి కూడా వెంటవుండి తీసుకువెళ్ళాలి. ఆసుపత్రి సిబ్బందికి మృతదేహాన్ని అప్పగించిన తర్వాత వీళ్ళ బాధ్యత పూర్తవుతుంది. అప్పుడు ఇద్దరికీ చెరో ముప్పయి రూపాయలు ఇస్తారు పోలీసులు. కానిస్టేబుల్, ఫోటోగ్రాఫరు డ్రైవర్ పక్కన కూర్చున్నారు వానులో. వాను కదిలింది.

★ ★ ★

రాములు మనసు కన్నీరు మున్నీరుగా రోదిస్తోంది. అతని మనస్సులో తండ్రి జ్ఞాపకాలు మెదిలాయి. 'ఎట్టాంటోడు తన అయ్య! ఎట్టావోయిండు!' అనుకున్నాడతను.

రాములుది పాలమూరు జిల్లా యాపర్ల. ఊరంతా రాళ్ళమయం. ఊరి పక్కనే కృష్ణ

పారుతూవుంటుంది. యాపర్ల నుండి ఆలంపూరుకు, కర్నూలుకు జనం 'అరిగె' ఎక్కి వెళ్తారు. ఆ ప్రదేశం అంతా రాళ్ళమయం అవటంతో మామూలు కొయ్యపడవలు పనికిరావు. ఏ రాయికైనా తగులుకుని అవి ముక్కలవవచ్చు. అందువల్ల చర్మంతోచేసిన 'పుట్టి'లు లేక 'అరిగె'లు వాడ్తారు జనం. కృష్ణా తీరం, ఆ ఊరు అంటే రాములికి ప్రాణం. అతని బాల్యమంతా కృష్ణలో ఈదుతూనే గడిపాడు. ఒకోసారి ఆలంపూరు వెళ్ళి తుంగభద్రలో ఈదేవాడు. ఈతన్నా అతనికెంతో ఇష్టం. ఇక్కడ నేర్చుకున్న ఈతలో ప్రావీణ్యం హుసేన్‌సాగర్‌లో పనికివచ్చింది అతనికి. హైదరాబాదు వచ్చినా యాపర్లని మర్చిపోలేకపోయాడు రాములు.

రాములు తండ్రి శాయన్న నిజానికి రాములు కన్నతండ్రి కాదు. పెంచుకున్న తండ్రి. శాయన్న తన కన్నతండ్రి కాదన్న నిజం రాములుకి పదిహేను, పదహారేళ్ళొచ్చేదాకా తెలియదు. అంత ప్రేమగా పెంచాడు శాయన్న రాముల్ని. రాములి తల్లిదండ్రుల ఇల్లు కృష్ణకు కొంచెం దిగువగా వుండేది. అనుకోని వరద ముంపొచ్చింది కృష్ణలో ఆ వానాకాలం. ఇల్లూ, తల్లిదండ్రులూ కొట్టుకుపోయారు వరదలో. కొడుకుని ఎత్తుకుని ఒడ్డుకు చేరాలనే ప్రయత్నం ఫలించలేదు అతని కన్నతండ్రికి. కొట్టుకుపోతూ ఒడ్డుకు విసిరాడు కొడుకుని. రాములు ఒడ్డుకు చేరలేకపోయాడు కాని, ప్రాణభయంతో అక్కడున్న చెట్టుని గట్టిగా కావలించుకున్నాడు నాలుగ్గంటలు అలానే వుండిపోయాడు. వరద ముంపు నుండి జనాన్ని రక్షించాలని ప్రయత్నంచేస్తున్న శాయన్న, భగవంతరెడ్డి కళ్ళ పడ్డాడప్పుడు రాములు. రాముల్ని తెచ్చుకుని పెంచి పెద్దచేశాడు శాయన్న. కన్నతండ్రీ, తల్లీ ఆ బాల్యం ఏమీ గుర్తులేదు రాములుకు. వరద ముంపులో నాలుగ్గంటలు చెట్టును పట్టుకుని గడిపిన క్షణాలే అతని మనసులో గుర్తుండిపోయాయి.

రాముల్ని చేరదీసే సమయానికే 30 ఏళ్ళ వయసుంది శాయన్నకు. శాయన్న తాత, తండ్రి భగవంతరెడ్డి ఇంట్లో జీతగాళ్ళుగా పనిచేసేవాళ్ళు. ఆ కొలువు తరతరాలనుండి సాగుతూ వస్తున్నది. శాయన్న, భగవంతరెడ్డి ఒకే వయసువాళ్ళు. వయసులో అల్లరిచిల్లరగా తిరిగేవాళ్ళు. గుమ్మడంలో రామిరెడ్డితో పోటీ భగవంతరెడ్డికి. రెండు పార్టీలకు పోట్లాటలు, దొమ్మీలు జరుగుతూ వుండేవి. అలాంటి ఓ దొమ్మీలోనే శాయన్న కుంటివాడయాడు. రామిరెడ్డి పార్టీవాళ్ళు పారిపోతున్న భగవంతరెడ్డిపై కత్తి విసిరారు. భగవంతరెడ్డి చూసుకోలేదు. దొరను రక్షిద్దామని కాలడ్డం పెట్టిన శాయన్నపాదం ఇంచుమించుగా తెగిపోయింది. 'సస్తి దొరా!' అని నేల కూలిన శాయన్నను భుజాన వేసుకుని తీసుకొచ్చాడు భగవంతరెడ్డి యావర్లకు. ఊరుకొచ్చిన తర్వాత శాయన్నకు నాటువైద్యం చేయించాడు భగవంతరెడ్డి. సగం పాదం తెగిపోయింది. నరాలన్నీ దెబ్బతిన్నాయి. మళ్ళీ జీవితంలో సరిగ్గా నడవలేకపోయాడు శాయన్న. అయితే కుంటితనం శాయన్నకు జ్ఞానదృష్టిని ప్రసాదించింది. కుంటివాడికి పిల్లనెవరూ ఇయ్యలేదు. జీవితమంతా బ్రహ్మచారిగానే గడిపాడు శాయన్న.

కొట్లాటలవల్ల ప్రయోజనమేం లేదనినచ్చచెప్పాడు భగవంతరెడ్డికి. తనవల్లే అవిటి వాడయ్యాడని మనసులో బాధ వుంది భగవంతరెడ్డికి. అయితే చిన్నప్పటినుండి కలిసిమెలిసి తిరిగిన ఆత్మీయత అంతకంటే గొప్పది. కొలువుకు పనికిరాడు కుంటివాడు అని అతన్ని తీసెయ్యలేదు భగవంతరెడ్డి.

గుమ్మడంలోను, యావర్లలోను భగవంతరెడ్డి దొరకు పొలాలున్నాయి. దొర వ్యవసాయపు పని అంతా శాయన్నే అజమాయిషీ చేసేవాడు. తను పనిచేసేవాడు, పనిచేయించేవాడు. పని ఎగ్గొడదామనే కుంటి మనసున్న మనుషులకంటే కాలు కుంటి అయిన శాయన్నే బాగా పనిచేసేవాడు. సాయంత్రాలెప్పుడైనా బడి అయ్యవారి దగ్గరో, దేవళంలో పూజారి దగ్గరో కూర్చునేవాడు. వాళ్ళు చెప్పేమాటలు వినేవాడు, పురాణ కథలు చెవినేసుకునేవాడు. వాటిని గూర్చి ఊహించేవాడు. ఆలోచించేవాడు. అలా అతనికో దార్శనిక దృష్టి అలవడ్డది. తనే కథలు చెప్పేవాడు జనానికి నీతిని బోధిస్తూ.

ఆ దొమ్మీ దొర, సేవకుల జీవితాల్లో విభజన రేఖ అయిపోయింది. సేవకుడి ఎత్తుకు దొర చేరలేదు. దొర మార్గం వేరయింది. ఇదివరకులా కొట్లాటలకు, దొమ్మీలకు దిగటం లేదుగాని, భగవంతరెడ్డి ఇప్పుడు అస్తమానం హైదరాబాదులో గడుపుతూండేవాడు. అక్కడ ఆయన జీవితం పైలాపచ్చీసుగా వుందని వార్తలు వచ్చేవి. యావర్లలో అతని భార్య మొగుడు తనని వదలివేశాడని గోలపెట్టేది.

భగవంతరెడ్డి దొరకు శాయన్నమీద పూర్తి నమ్మకం. తనులేకపోయినా పనులేమీ ఆగవనీ, శాయన్న అన్నీ చక్కగా నిర్వహిస్తాడనీ విశ్వాసం. అయితే శాయన్నకుదొర చేస్తున్న పని నచ్చలేదు. నచ్చని విషయం నిర్మొహమాటంగా చెప్పేతత్వం శాయన్నది. ఓసారి భగవంతరెడ్డి యాపర్ల వచ్చినప్పుడు చెప్పేశాడు శాయన్న.

''దొరా! నువ్వు జేస్తున్న పనేం మంచిదిగాదు'' అని.

''ఏందిరా ఏంజేస్తి!'' అనడిగాడు దొర.

''నీ భార్య నీడొదలి మంది లంజలెంటబడి తిరుగుతుండవు. నలుగురికి సెప్పోల్సినోడివి నువు జేసే పనిమంచిదా? సింతజేస్కోని సెప్పు!''

భగవంతరెడ్డి దొరకు కోపం వచ్చింది.

''ఒరేయ్ శాయన్నా! నువ్వు ఎచ్చుతగ్గులెంచకుండ మాట్లాడుతున్నవురా. నువ్వు నాకు జెప్పేటంతోడివయినావురా!'' అన్నాడు.

''సత్తెం చెప్పటానికి ఎచ్చుతగ్గులెందుకు దొరా! నువ్విట్టా తిరుగుతుండవు. పెండ్లాన్ని అదుపు

జేయనీకేడ అక్కుంది? ఓ కత జెప్తానినుకో. ఓ పట్నంలో ఓ రాజు. రాజుకో మంత్రి వుండె. మంత్రి బార్య సూడసక్కని సిన్నది. రాజు మంత్రి బార్యను అనుబంగించాలని మనసువడె. ఓ పాలి రాజు మంత్రిని పిలిపించి ఏదో జరూరు పనిమీద ఊరుబయటకు తోలిండు. మంత్రి పోయినంక రాజు మంత్రి ఇంటికి వచ్చిండు. రాజును జూసి మంత్రి భార్య మర్యాదగా కూర్చేసి కూసుండబెట్టింది. మంచినీలియమని రాజడిగిండు. మంత్రి భార్య రాజు మనసు గుర్తువట్టి, మట్టి గిలాసలో, బంగారు గిలాసలో, రాగి గిలాసలో, ఇత్తడి గిలాసలో, రాతెండి గిలాసలో ఇట్టా పన్నెండు గిలాసల్లో ఒకటే బాయి, ఒకటే కుండల నీల్లు దెచ్చి ముందలవెట్టె. రాజు ఒక్కొక్క గిలాస నుంచి ఒక్కొక్క బుక్క నీల్లు తాగిండు. అప్పుడామె 'ఓ రాజా! నీల్లు ఎట్లుండవయ్యా?' అని అడిగింది. రాజు 'ఒక్కటేరకంగావున్న'వన్నాడు. అప్పుడామె, 'ఒక్కటే రకంగా వుంటే ఈడికెందుకొచ్చినవయ్యా' అంది. రాజు ఏం మాట్లాడలేదు. 'నీ బార్య అయిన, నేనయినా ఒకటే, మరి నా తానికి ఎందుకొచ్చినవు' అనడిగె. రాజు సిగ్గుపడి అట్టనే లేచిపాయె. కన్కదొరా! ఏ ఆడిబాలయినా ఒక్కటేరకం. ముక్యం ఏందంటే మనషన్నోడు మంచిగ బతకాలి, పరాయివోడి పెండ్లాన్ని అక్కసెల్లెలు లెక్క సూడాలి.''

దొరేం మాట్లాడలేదు. కోపంగా అక్కడనుంచి లేచిపోయాడు. అయితే ఆ తరువాత ఆలోచనచేశాడు. ఆ తరువాత నాల్గురు వేలెత్తి చూపెట్టేట్టుగా ప్రవర్తించలేదు. ఎక్కువభాగం యాపర్లలోనే వుండేవాడు. ఎప్పుడో ఆర్నెల్లకోసారి హైదరాబాదు వెళ్ళి ఏంచేసేవాడోకాని, ఊళ్ళో మాత్రం చాలా మర్యాదగా వుండేవాడు. భార్య మళ్ళా ఫిర్యాదు చేయాల్సిన అవసరం కల్గించలేదు.

ఊళ్ళో ఎవరికి ఏ అవసరమొచ్చినా శాయన్న దగ్గరకు వచ్చేవాళ్ళు సాయానికి. అల్లరిచిల్లరిగా దొర అండతో తిరిగిన శాయన్నకాదు అతడు. రాముల్ని సాకటం మొదలెట్టిన తర్వాత పూర్తిగా మారిపోయాడు అతను.

పొలం యాజమాన్యం చేసే శాయన్న స్వతంత్రం వహించేవాడు. ఏడాదికోసారి పంట పొలంలో ఊరి పనులుచేసే మంగలి, చాకలి, తలారిలకు ధాన్యం కొలిచిచ్చేవాడు. ఓసారి మంగలాయన, ''శాయన్నా! ఇంకో రెండు సంచులెక్కువ కొలువన్నా! నా పెండ్లాం బీమారుంది. ఆలంపురం తోలుకెళ్ళాలి. పైసలు గావాలి'' అని ప్రార్థించాడు.

''ఓరి! ఊళ్ళోవాండ్లకు నువ్వే వైద్దుగం చేసెటోడివి, నీ పెండ్లాన్ని బయటకు తీసుకెళ్తవురా!'' అన్నాడు శాయన్న.

''నా శాతగాలేదన్నా! ఆలంపురంలో జూపిస్త'' అన్నాడు.

శాయన్న మారు మాట్లాడకుండా అట్లాగే ఎక్కువ ధాన్యం కొల్చాడు. శాయన్నంటే పడని మరో జీతగాడు యాదయ్య వెళ్ళి దొరకు ఈ సంగతి ఊదాడు. శాయన్న స్వతంత్రంగా తన

ఇష్టంవచ్చినట్టు వ్యవహరిస్తున్నాడనీ చెప్పాడు. దొర ఏ కళనున్నాడో, మండిపోయాడు. అప్పటికప్పుడు శాయన్నను పిలిపించాడు.

''ఏందిరో! నువ్వుగూడ దొర అయిపోయినావంట. నీ ఇచ్చారచ్చాగ (ఇష్టారాజ్యంగా) దాన్యం కొల్సిపోస్తున్నవంట పుల్లరోళ్ళకు'' అనడిగాడు.

''అవునయ్యా, మంగలాయన భార్యకు బాగలేదు పెయ్యిల. ఆలంపురం దీసుకెళ్ళాలంట. ఓరెండు సంచులు ఎక్కువ కొలవమంటే కొల్చిన దొరా?'' అన్నాడు శాయన్న.

''సంపేత్తరోయ్ కొడక! నన్నడగ పన్లేదురా, నా పంట నన్నడగకుండ దానం జేస్తవురా! రెండో కాలిరగ్గొడతా నయాలా!'' అన్నాడు దొర కోపంగా.

''ఇరగ్గొట్టయ్యా, అడ్డు సెప్పింది ఎవరు? ఈ కాలూ నీ ఉప్పు తినే పెరిగింది. నీ కాలును నువ్విరగ్గొడతనంటే నేనెందుకడ్డువెట్టాలి....''

''ఛల్... తప్పుడు కొడక! మాటలు మారుస్తవు!''

ఆమాటలు విన్పించుకోలేదు శాయన్న చెప్తానే పోయాడు.

''మనం కుడిసింది రేపీపాటికి పాయె. ఎవరికైనా ఇచ్చిందే మనకు దక్కుటాయె. ఉన్నోడు గూడ అన్నమే దింటడుగాని, బంగారం తినడు. ఒకత జెప్తా, ఇనుకో. ఓ ఊర్ల ఓ సావుకారి వుండె. ఆడుశాన పీనాసోడు. పిల్లికి బిచ్చం పెట్టకపోయెటోడు. ఆడోసారి మస్తు బీమారయిండు. ఎవరో సెప్పవట్టిరి. 'దానం సెయ్యి. నువ్వు సస్తే నీ ఎంటేంరాదు. ఆ పున్యంతో బతికి బట్టకడ్తవు' అని. పోరగా పోరగా చివరకో సాదువును పిల్చి ఓ వరా (వరహా) కాసిచ్చిండు. ఆ పున్యంతో రోగం నయమాయె. బతికిపోయిండు. కాని తర్వాత, 'ఆ వరాకాసు సాదువుకు దండుగిస్తినే' అని మనుగోత్రం (మనోవ్యాధి) బట్టి సావుబతుకులవుండె. అప్పుడు యమబటులొచ్చిన్రు. సావుకారిని పట్టుకెల్లిన్రు. 'ఏందిరా సావుకారి! నీ జల్మల జేసిన పున్యం అదొక్కటేనాయె. దానికి మనుగోత్రం వట్టి సస్తివి. నీకింకా వంద జల్మలదాంక బుద్దిరాదురా! ఓరే యమబటులూ! ఈణ్ణి తీసుకెల్లి ఎర్రగా కాల్సిన సూదుల్తో పెయ్యంతా పొడిపించండిరా' అని ఆళ్ళకు సెప్పిండు యమధర్మరాజు. ఆళ్ళు సావుకారిని తీసుకెళ్ళిన్రు. సావుకారి బుగులుపడిపాయె. 'ఇదెక్కడి తంటారా నాయనా! కాల్చిన సూదుల్తో పొడిసి సంపేస్తరు. ఈబాద ఎట్టా బరించాల్రా' అని ఆసాదువును తల్సుకుని మొక్కిండు. 'అయ్యా సాములోరూ! నన్ను రచ్చించయ్యా! యములోల్లు నన్ను సూదుల్తో పొడిసి సంపుతుండరు. నువ్వే నాకింక దిక్కు' అని మొత్తుకునె. అప్పుడు యములోళ్ళు ఈడిని సూదుల్తో పొడవబట్టిరి. ఈడు దానం జేసిన ఆ వరాకాసు వంద, వెయ్యి కాసులయి పతి ఒక్క సూదికి అడ్డంవడె. దాంతో యములోళ్ళు ఈణ్ణేం జెయ్యలేకపోయిన్రు. అప్పుడు చిత్రగుప్తుడు, 'పోరా పో! నీకు పాటం నేర్పించటానికే ఈ సాలె

(బడి)కు దీస్కాస్తిమి. సమజయిందా పున్యం మయిమ. పోయి ఇంగ దానదర్మాలు చేసుకుంట బతుకు' అని నరకాన్నుంచి తోలిచ్చిండు. అక్కడ బూలోకంల సావుకారి కొడుకుల ఈడి పీనిగెని బొందల వెట్టజూస్తుండ్రి. అప్పుడు లేసి కూర్సునె సావుకారి. దానదర్మాలు చేసుకుంట సుకముండె. అది దొరా! నేను చెప్పింది మనసుల వెట్టుకో. నువ్వు ఇచ్చిందే నీ కక్కర కొస్తదిగాని, నువ్వు తిన్నది నీకక్కరకు రాదు.''

దొర శాయన్న మాటలు విని నవ్వాడు. అలాంటి సంబంధముండేది వాళ్ళిద్దరిమధ్య. అది దొర - బంటుల సంబంధంకాదు. ఆత్మలకు సంబంధించిన బంధమది. అలా ఎన్నో వసంతాలు గడిచాయి. ఇద్దరూ ముసలివాళ్లయినా ఆ ఆత్మీయత పోలేదు.

అట్టాంటి దొర చనిపోయాడు. శాయన్న దుఃఖాన్ని పట్ట ఎవరితరమూ కాకపోయింది. శాయన్న ఇదివరకులా పనిచేయలేకపోయాడు. భగవంతరెడ్డి కొడుకులు చెప్పేశారు, ''ఓరే కుంటోడా! నువ్వేం పనిజేస్తవుగాని, నీ కొడుకుని పంపించు పనిలోకి'' అని. వాళ్ళకు మనిషి తెలీదు. మనిషి తెలీని, భౌతిక జీవనమే వాళ్లకర్థమైంది. రాములు దొరల సేద్యంలో కుదురుకున్నాడుగాని, దొరల కొడుకులకు పొలాలమీద దృష్టిలేదు. బిజినెస్ చేయాలనీ ఇంకా, ఇంకా డబ్బు గడించాలనీ వుంది. వాళ్ళు పొలాలు అమ్మజూపినప్పుడు దొర కొడుకులకు చెప్పి చూశాడు శాయన్న ''భూమి తల్లిని అమ్మకు దొరా! ఆయమ్మ నీక్కావల్సినంత ఈకున్నా, నిన్నుపాసం బెట్టదు. భూమితల్లే అసలు దనమయ్యా. తక్కినదంతా మాయ. మీ రేందో దూరపు కొండల్ని జూసివోతన్నారు. అయ్యన్నీ నునుపుగానే కన్పిస్తయ్యి. ఆడకెల్లితేగాని అయ్యేంటో తెలవదు మీకు'' అని. కాని కుంటివాడి మాట పట్టించుకునే స్థితిలో లేరు వాళ్ళు. పొలాన్ని వచ్చిన ధరకు తెగనమ్మి పెద్దకొడుకు రామిరెడ్డి పాలమూరుకు, చిన్నకొడుకు శివారెడ్డి హైదరాబాదుకు వెళ్ళిపోయారు.

అలా శాయన్నకు, రాములుకు జీవనాధారం పోయింది. అప్పటికే రాములికి, సీతాలుకి పెళ్ళయి ఓ కొడుకు పుట్టాడు.

''మరిప్పుడేంజేస్తం నాయనా! వున్న ఆగారం (ఆధారం) వోయెగందా'' అన్నాడు రాములు.

''ఏందిర కొడక అంత బుగులు పడ్తవు! గరిక మేడలో గురకలు లెస్స అని సెప్పవట్టేరి. మన దేంది - వున్నదేంది, వోయిందేది. నారు వోసినోడు నీరు వోయడా. పద ఎల్దాం అయిదరాబాద్. అల్లంతా ఏం బావుకుంటింద్రో మనవూ సూద్దాం పదిరి.''

శాయన్న ఇచ్చిన భరోసాతో రాములు పట్నం వచ్చాడు భార్యను, కొడుకును, తండ్రిని తీసుకుని. తమ ఊరివాడయిన సాయిలు గుడిసె పక్కనే ఇంకో గుడిసెలో అద్దెకు దిగారు. పట్నంలో రాములికేం పని దొరకలేదు. చివరకు రిక్షా లాక్కోవాల్సివచ్చింది. పొలంలో పనిచేసిన

రైతుకు ఆ పని నామోషీ అనిపించింది. శాయన్న కొడుక్కి చెప్పాడు ''ఓరే కొడకా! అదేం తప్పు పని కాదురా! కడుపు కోసం పనిసెయ్యమన్నరుగాని, కష్టపడొద్దనలేదుర. పూర్వం దర్మవ్యాదుడనే కటికోడి తాన కవుశికుడనే బాపనాయన పాటం నేర్చుకునె. పనిల ఉచ్చం నీచం లేదుర. మనిషి పెద్దోడయితే ఆడుసేసే పనీ పెద్దదవుతాది. మనిషి సిన్నోడవుతే ఆడుసేసే పనీ సిన్నదవుతాది. నీ పనిల బుద్ధుంచి సెయ్యి. అన్యాలంగా కమాయించకు'' అని.

తండ్రి అలా నచ్చచెప్పిన తర్వాత రాములు రిక్షా తొక్కటం మొదలెట్టాడు. సీతాలు నాలుగిండ్లలో పనిపాటలు చేయనారంభించింది. ఎప్పుడైనా తీరిక వున్నప్పుడు హుసేన్‌సాగర్‌లో ఈతకొట్టటానికి వెళ్ళేవాడు రాములు. కృష్ణ ,తుంగభద్రల్లో ఈదిన రాములుకు హుసేన్‌సాగర్ నిజానికి కంపుగొట్టే గుంటే అయేది. ఈదిన తృప్తి కలిగేది కాదు. అయినా ఆరాటం పట్టకవచ్చేవాడు. అలా ఓసారి వచ్చినప్పుడు పోలీసువాళ్ళు చచ్చిన శవాన్ని తీయటానికి కూలివాడు దొరక్క రాములుని కుదుర్చుకున్నారు. అప్పటినుండి ఎప్పుడు సాగర్‌లో శవం తేలినా రాముడిని పిల్చేవాళ్ళు, నర్సింహతో కబురంపి. ఆరోజు ముప్పయి రూపాయలొచ్చేవి. అదో అదనపు సంపాదన. నాల్గురోజులు కడుపునిండా అన్నంతినేవాళ్ళు ఇంటిల్లిపాదీ.

పట్నానికొచ్చినప్పటినుండి శాయన్న ఒంట్లో బావుండటంలేదు. ఉస్మానియా ఆసుపత్రిలో చూపించుకుంటే అక్కడి డాక్టర్లు అతన్ని కాన్సర్ హాస్పిటల్లో చూపించుకోమన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని రాములు, ఆరోజు రిక్షాతొక్కటం మానుకుని ఆసుపత్రికి తీసుకువెళ్ళాడు. నాల్గురోజులు పరీక్షలు చెయ్యాలి అని తండ్రీ కొడుకులని ఆసుపత్రి చుట్టూ తిప్పారు డాక్టర్లు.

శాయన్నకు ఏంతిన్నా లోపలకు పోయేదికాదు. కడుపులో విపరీతమైన నొప్పి వచ్చేది. పరీక్షలయింతర్వాత శాయన్న డాక్టర్నడిగాడు. ''ఏంది డాకటరుబాబూ! నాకేటైందో సెప్పు'' అని.

''ఇంత ఆలస్యం చేశావెందుకు ముసలాయనా! చిన్నపేగుల్లో కాన్సరు పుండయింది'' అన్నాడు డాక్టరు.

''దీనికి ఇలాజు లేదా డాకటరు బాబూ?''

''చేస్తాం, భరోసా ఇవ్వలేం''

''పోనీ ఇది సెప్పయ్యా! నేనింకా ఎంతకాలం బతుకుతాను?''

''బతుకుతావులే. ఏం భయంలేదు.''

''బయమెందుకయ్యా? డెబ్బయి ఏండ్లొచ్చిన ముసలోడికి నాకు బయమెందుకు? వున్నమాట సెప్పు.''

''రెండు మూడు నెల్లు. మహా అయితే ఆర్నెల్లు. చివరి స్టేజీలోకొచ్చేశావు.''

''అట్టాగా! నిజం సెప్పి మంచి పనిసేస్తివి. ఎల్లిపోయేందుకు నేనూ తయారవాలిగందా.''

అంతే, ఆరోజు ఆసుపత్రి నుండి వచ్చింతర్వాత, మళ్ళీ ఆసుపత్రి ఊసు ఎత్తలేదు శాయిలు. కోడలు, కొడుకు ఎంత చెప్పినా మళ్ళీ ఆసుపత్రి కెళ్ళి వైద్యం చేయించుకునేందుకు ఒప్పుకోలేదు. దేవుడి పేరు తల్చుకుని రోజులు దొర్లించసాగాడు. తనకొచ్చిన పాటలు పాడుకునేవాడు. ఓరోజు రాముల్ని పిల్చి చెప్పాడు శాయన్న.

''ఒరే! మనూరు పోయిరావాలనున్నదిరా. పోయేముందు అందర్నీ సూడాలనున్నదిరా''అని.

''ఇప్పుడెట్లాపోతాయే. నీ పెయ్యిల బాగోలేదు. అక్కడ బీమారయితే..''

''పర్లేదు కొడకా, నేనెళ్ళొస్తాగా''

''మరి పైసలు గావాలిగందా. నాల్గు రోజులాగు. పైసలు జూసి పంపిస్తా.''

''నా తానున్నాయిలేరా పైసలు. సివరి పయానానికేం పైసలుగావాల. కావల్సినయ్యి నాతాన మస్తున్నయ్యి.''

★ ★ ★

అప్పుడు తండ్రి మాటలు రాములికి అర్థం కాలేదు. మర్నాడు కోడలికి, కొడుక్కి జాగ్రత్తలు చెప్పి మాయమయాడు శాయన్న. చివరికెక్కడ తేలాడు. చివరకు చస్తూ కూడా తనకు పైసలిచ్చిపోయాడు. ఉస్మానియా ఆసుపత్రిలో శవాన్ని దించిన తర్వాత కానిస్టేబుల్ రసీదు తీసుకుని వీళ్ళకు చెరి ముప్పై రూపాయలు ఇస్తున్నప్పుడు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి రాములుకు.

''ఏందిరా, నువ్వేడుస్తున్నావు?'' అడిగాడు కానిస్టేబుల్.

''ఏం లేదయ్యా! కంటిల ఏదో నలక పడినాది.''

ఆసుపత్రి దాటి బయటకొచ్చిం తర్వాత నర్సింహతో అన్నాడు రాములు, ''ఇంటికెల్లి సీతాల్ను తోలుకొస్తాను. మామను సివరి సూపులయినా సూస్తదది''అని.

''తప్పుడు పన్లు సెయ్యక. పోలీసోళ్ళు ఆవులిస్తే పేగులు లెక్కపెడ్తారు. మీనాయన కిదంతా తెలవకా నీకు సెప్పకుండా పోయింది. పోతూ పోతూ కూడా కొడుక్కేమీ నష్టం కల్గించకుండా పోయిండు. నాల్గు రూపాయల ముట్టజెప్పిండు. ఈ పాటికింటికెళ్ళు..'' అని బుద్ధిచెప్పాడు నర్సింహ.

ఇంటిదారి పట్టిన రాములు మదిలో తండ్రి ఒకప్పుడు చెప్పిన కథ గుర్తుకొచ్చింది.

''మనిషన్నోడు తనకోసం బతక్కోడుదురా. పక్కోడికోసం బతకాల. పూర్వం శిబి అని ఓ రాజుండేవోడు. పక్కోడికోసం పాణాలు పెట్టే మనిషాయన. శాన దానగునం వున్న మనిషి. ఓ పాలి ఇంద్రదేవుడు, అగ్నిదేవుడు శిబిరాజును పరీచ్చిద్దామనుకుంటిరి. ఇంద్రుడు డేగ అయిండు. అగ్ని దేవుడు పావురాయి అయిండు. డేగ పావురాయిను తరుముకుంటూ వచ్చినాది. పావురాయి శిబిరాజు తానకొచ్చి, 'నన్ను రచ్చించు రాజా! ఆ డేగ నా పానం తీస్తది' అనవట్టె. 'నీకేం బయంలేదు. నేనున్నాను' అనె రాజు. ఇంతలో డేగ వచ్చింది గప్పుగప్పున. వచ్చి అంది, 'ఓ రాజా! నాకాకలేస్తావుంది. ఈ పావురాయి నా బువ్వ. దాన్ని నాకొగ్గేయి. దర్మాత్ముడివి. దర్మానికి బాద కలిగేతాన ఆ దర్మం దర్మంకాదు. దర్మం అనేది అందరికీ మంచి జేయాల. ఈ పావురాయి నాకు ఆగారం అవ్వటం దర్మం' అనవట్టె. అప్పుడురాజు, 'ఇది పానబయంతో నాతాన కొచ్చింది. దీన్నిప్పుడు నేనిడువ. దానికి బదులుగా దాని బరువు నా పెయ్యి మాంసం కోసిస్తా. కుడవ'మనె. 'సరే, గట్లయితే మంచిదే' అనవట్టె డేగ. రాజు తాసు తెప్పించె. అత్వార (హథియార్-కత్తి)తో తన పెయ్యి కోస్తుండె. పళ్ళెంల ఏస్తుండె. ఎంతేసినా, పావురాయి పళ్లెం బరువే ఎక్కువవుండె. సివరికిట్లాగాదని తనే ఆ పళ్ళెంల కూర్చునె. అప్పుడు ఇంద్రదేవుడు, అగ్నిదేవుడు రాజు గొప్పతనానికి, ఆతమతాగానకి మెచ్చి, తమ రూపాల ప్రదీచ్చమైంద్రు (ప్రత్యక్షమయ్యారు), వరాలిచ్చింద్రు. అట్లా బతకాలిరా మనిషన్నోడు. శిబిరాజు లెక్క బతకాలి.''

'ఈనాడు' ఆదివారం

1-11-1992